క్లుప్తంగా

కొండపై భూమిని కేటాయించండి



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ కులస్తులు

పెనుకొండ: పెనుకొండ కొండపై శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేయాలని, కొండపై ఎకరా భూమిని కేటాయించాలని బలిజ కులస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద బలిజ కులస్తులు రాయల 516 పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల విగ్రహానికి భారీ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ రాయల జయంతిని ప్రభుత్వం ప్రతియేటా ఘనంగా నిర్వహించాలన్నారు. కొండపై లక్ష్మీ నరసింహస్వామి విగ్రహంతో పాటు శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎకరా భూమి కేటాయిస్తే పార్కు, కల్యాణ మండపం నిర్మిస్తామన్నారు. బలిజ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేసి ఆదుకోవాలన్నారు.

స్వాతంత్య్రోద్యమంలో 'క్విట్ ఇండియా'ది కీలక పాత్ర



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్విట్ ఇండియా డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్య్రోద్యమానికి తలమానికమని పేర్కొన్నారు. బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమి కొట్టడంలో క్విట్ ఇండియా కీలక పాత్ర పోషించిందన్నారు. విదేశీ వస్తు బహిష్కరణ ద్వారా స్వదేశీ వస్తుత్పత్తికి ఆదరణ పెరిగిందన్నారు. అధ్యాపకులు జయప్ప, యశోధా రాణి, కాంతారావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ




రామచంద్రారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి చిన్నాన్న రామచంద్రారెడ్డి గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి శుక్రవారం కొత్తచామలపల్లి గ్రామానికి చేరుకొని రామచంద్రారెడ్డి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సురేష్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమ రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా మెయింటెనెన్స్, వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు కారణంగా కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పరిగి, బీరేడ్డిపల్లి, చిన్నపల్లి, శిరేకోళం, హొన్నంపల్లి, కాలువపల్లి, నేతులపల్లి, సుబ్బరాయనిపల్లి, శాసనకోట గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యూటీఎఫ్ నాయకులు రిటైర్డ్ హెచ్ఎం.రామాంజినేయులు జ్ఞాపకార్థం శుక్రవారం నిర్వహించిన యూటీఎఫ్ ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉదయం అగళి – రొద్దం రైడర్స్ మధ్య మ్యాచ్ జరగ్గా అగళి జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం హిందూపురం – ధర్మవరం మధ్య మ్యాచ్ జరగ్గా హిందూపురం జట్టు విజయం సాధించింది.



హిందూపురం: అష్టలక్ష్మి ఆలయంలో విశేష అలంకరణలో అమ్మవార్లు



హిందూపురం: అలంకరణలో కొల్హాపూరి మహాలక్ష్మీదేవి



పరిగి: వరలక్ష్మీదేవి పూజ చేసిన దృశ్యం



పెనుకొండ మండలం చంద్రగిరిలో మహాలక్ష్మి అలంకరణలో మహేశ్వరి



హిందూపురం: అలంకరణలో మహాలక్ష్మీదేవి

వరలక్ష్మీ నమోస్తుతే !

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. శుక్రవారం ఉదయం నుంచే వివిధ ఆలయాలతో పాటు ఇంటింటా వరలక్ష్మీదేవిని కొలువు దీర్చారు. చీరలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు, నగదుతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



గుడిబండలో వరలక్ష్మీదేవికి పూజలు నిర్వహించిన దృశ్యం



అలంకరణలో రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి



పెనుకొండలోని తన నివాసంలో వరలక్ష్మికి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



రొద్దంలో..



అగళిలో..



పావగడ: వెండి రథంపై ఊరేగుతున్న శీతలాంబదేవి



పెనుకొండ: వరలక్ష్మీ పూజలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు



హిందూపురం: వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అష్టలక్ష్మికి పూజ చేస్తున్న భక్తులు



అమరాపురం: లక్ష్మీదేవికి పూజ చేస్తున్న మహిళలు



హిందూపురం: హయగ్రీవ స్వామి ఆలయంలో భక్తుల పూజలు

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: సెలవు రోజుల్లో విద్యాసంస్థలు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని బీసీ హాస్టల్‌లో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వ సెలవులు ఉన్నాయని, అయినా కూడా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. సంబంధిత విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి

కార్యక్రమంలో నాయకులు భగత్ రాజు, అనుదీప్, నాజీర్, మహేష్, నవీన్, తిమ్మరాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాన్ని ఇంటింటికీ వివరిద్దాం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం పంచాయతీ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీ ఇన్‌చార్జ్ కరియన్న సూచించారు. శుక్రవారం ఆర్ అనంతపురం పంచాయతీ కేంద్రంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం విజయవంతంపై స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. కరియన్న మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన చంద్రబాబు నేటికీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కూటమి వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించడానికే బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం జరిగే కార్యక్రమానికి అధిక సంఖ్యలో రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న కరియన్న

ఘనంగా జలధి ఉత్సవం



అలంకరణలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు



జలధి ఉత్సవానికి తరలి వెళుతున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు గ్రామంలో మాల కులస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి గ్రామ వీధుల గుండా డప్పు వాయిద్యాలతో సమీపంలోని పెద్దవంక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ దేవతలను కూర్చోబెట్టి గంగా జలంతో శుద్ధి చేశారు. అనంతరం వివిధ రకాల అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు దేవతలకు పూజలు చేయించారు. తిరిగి అక్కడి నుంచి గ్రామ వీధుల ఆలయంలోకి తీసుకొచ్చారు. తర్వాత స్వామి వారికి భక్తులు తెచ్చిన వివిధ రకాల పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం గ్రామంలో వెలసిన లక్కమ్మదేవి జ్యోతుల ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మేళతాళాలు, వాయిద్యాల ఊరేగింపుగా తీసుకువచ్చి విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి జ్యోతులు సమర్పించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మహిళకు తీవ్ర గాయాలు

రొళ్ల: సాగు చేసిన పూల తోటలో పూలను కోస్తుండగా అకస్మాత్తుగా చెట్టుకొమ్మ విరిగి మీద పడిన ఘటనలో కరియమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని నసేపల్లిగొల్లహట్టిలో కరియమ్మ తమ పొలంలో వేసిన పూల తోటలో పూలను కోస్తుండగా పొలంలో ఎండిన చెట్టు కొమ్మ కరియమ్మ తల మీద పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను శిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రయాణం.. నరకం

అమరాపురం: మండల పరిధిలోని యర్రగుంటప్ప వ్యవసాయ తోట ముందు భాగాన కళ్యాణదుర్గానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీనికి తోడు వర్షపు నీరు చేరడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం అంటే నరకమని వాపోతున్నారు. ఈ రోడ్డులో నిత్యం ఏపీఎస్ ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, టెంపోలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు తిరుగుతుంటాయి. దీంతో వాహనదారులు ఎప్పుడేం జరుగుతుందోననే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధితన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం రోడ్డులో ఏర్పడిన గుంతలను పూడ్చి ఎవరికి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంతలో వర్షపు నీరు చేరడంతో వాహన చోదకుల ఇబ్బందులు



రొద్దం మండలం పెద్దగువ్వలపల్లి సమీపంలో సాగైన కంది పంట

చిగురించిన ఆశలు

రొద్దం: మండల వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తుండటంతో కంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా పడిన వర్షానికి మంచి పదును అయినట్లు రైతులు చెబుతున్నారు. మండలంలో ఈ ఏడాది దాదాపు 4,800 హెక్టార్లలో కంది పంట సాగు చేశారు. ఈనెలలో వర్షం పడకపోయి ఉంటే కంది పంట పూర్తిగా దెబ్బతినేదని అన్నదాతలు అంటున్నారు.

పంటకు ప్రాణం పోసింది



రెండు రోజులుగా పదునైనా వర్షాలు కురుస్తుండటంతో కంది పంటకు ప్రాణం పోసినట్లు అయింది. జూన్ 15న నేను కంది పంట సాగు చేశాము. అయితే వర్షం ఆలస్యం కావడంతో పంట దెబ్బతింటుందని ఆందోళన పడ్డాను. ఈ సమయంలో వర్షం రావడంతో ఆనందంగా ఉంది. కంది రైతుల్లో ఆశలు చిగురించాయి.

– అంజినరెడ్డి ,పెద్దగువ్వలపల్లి

ముర్రుపాలు బిడ్డలకు అమృతంతో సమానం

పావగడ: అప్పుడే పుట్టిన చంటి బిడ్డలకు తల్లి ముర్రు పాలు అమృతంతో సమానం. పిల్లల్లో వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ సునీత తెలిపారు. తాలూకాలోని అరసికెరె గ్రామంలోని సముదాయ భవనంలో శుక్రవారం నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ సునీత గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. అనంతరం అంగనవాడీ కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, పీడీఓ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లి వద్ద ఉన్న జాతీయ రహదారి–42పై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో హరి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామం సమీపంలోని పేపర్ మిల్లు దగ్గర హరి వస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొని వేగంగా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు క్షతగాత్రున్ని తమ ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

మడకశిరరూరల్: మండల పరిధిలోని గోవిందపురం పంచాయతీ కేంద్రంలో శనివారం ఉదయం 9 గంటలకు బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నెమలి మృతిపై విచారణ

సోమందేపల్లి: మండలంలోని మరువకుంటపల్లి వద్ద ఈ నెల 1న నెమలి మృతి చెందిన ఘటనపై అటవీశాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. శుక్రవారం బీట్ ఆఫీసర్ రాహుల్ నెమలి చనిపోయిన ప్రదేశాన్ని పరిశీలించి రైతులను విచారించారు. సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభం ఉండటంతో నెమలి విద్యుత్ షాక్‌తో మృతి చెంది ఉంటుందన్నారు.

అనాథకు అంత్యక్రియలు

పరిగి: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన తమ ఔదార్యాన్ని చాటుకున్నారు మండలంలోని ఊటుకూరు పంచాయతీ బసవనపల్లి కాలనీ వాసులు. అనాథ అయిన వృద్ధురాలు (75) కొన్నేళ్లుగా ఇక్కడే సంచరిస్తూ కాలనీ వాసులు పెట్టింది తింటూ జీవనం సాగిస్తుండేది. అయితే గురువారం రాత్రి ఆమె చనిపోయింది. గమనించిన గ్రామస్తులు వెంటనే సెక్రెటరీ ఆనంద్‌కుమార్, వీఆర్వో రామాంజినేయులుకు సమాచారం ఇవ్వగా ఏఎస్ఐ బాలరాజు సమక్షంలో మృతదేహానికి పంచనామా నిర్వహించారు. తర్వాత అధికారుల, గ్రామస్తులంతా కలిసి వృద్ధురాలికి అంత్యక్రియలను నిర్వహించారు.

వక్క చెట్ల నరికివేత



వక్క చెట్లను పరిశీలిస్తున్న గ్రామస్తులు

పావగడ: తాలూకాలోని చిత్తగానహళ్లి గ్రామ రైతు సీఆర్ రంగన్నకు చెందిన సుమారు 120 వక్క చెట్లను దుండగులు నరికి వేసిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. సుమారు నాలుగేళ్ల వయస్సున్న వక్క చెట్లను నరికేయడంతో బాధిత రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేశ్ తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని సేవామందిరం కూడలిలో శుక్రవారం హిందూపురం – మడకశిర ప్రధాన రహదారి పక్కన ఉన్న వానరాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డు పక్కన చనిపోయి ఉన్న వానరాన్ని గుర్తించిన స్థానికులు అలాగే వదిలేయకుండా ఖననం చేయాలని నిర్ణయించారు. వెంటనే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. సేవామందిరంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకుడు వాసుదేవరావు, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గిరిష్‌కుమార్ ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: మండలంలోని డా. బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూప్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9440918075 నంబరును సంప్రదించాలన్నారు.